# సిపిఐ(ఎం)కు ఓటెయ్యండి

**వామపక్షాల్ని బలపర్చండి**

# మహిళల హక్కుల పరిరక్షణ కోసం

16వ లోక్‌సభ ఎన్నికల ప్రచార కరపత్రం 2014

**మ**హిళలు, ప్రత్యేకించి కాయకష్టం చేసే పేదవారి నుంచి వచ్చిన వారు యుపిఏ–2 పరిపాలనలో తీవ్రమైన ఆర్థిక, సామాజిక అభద్రతను ఎదుర్కొంటున్నారు. నిత్యావసర సరకుల ధరల నిరంతర పెరుగుదల, అధికారిక లెక్కల ప్రకారమే ఉపాధిని గణనీయంగా నష్టపోవటం, అంతకంతకూ స్త్రీలపై పెరుగుతున్న హింసాకృత్యాలు వంటివన్నీ వారు ఎదుర్కొంటున్న భయానక పరిస్థితికి అద్దం పడుతున్నాయి. యుపిఏ–1 హయాంలో మహిళలకు కొంత ఉపశాంతిని కల్పించటానికిగాను వామపక్షాల నేతృత్వంలో సాగిన ఉద్యమాల ఒత్తిడి కారణంగా చేపట్టిన కొన్ని చర్యలు సైతం యుపిఏ–2 పాలనలో బలహీన పడటం, కుదించుకు పోవడం జరిగింది.

ప్రతి ఐదుగురు మహిళల్లో ముగ్గురు రక్తహీనతతోనూ, మూడేళ్ళ వయసున్న పిల్లల్లో ప్రతి రెండవ శిశువు తక్కువ బరువుతోనూ, మొత్తం పిల్లల్లో ప్రతి మూడవ బిడ్డ ఎదుగుల లోపంతోనూ, అలానే ప్రతి ఐదవ బిడ్డ కునారిల్లి పోతున్న దేశంలో 2013–14 ఆర్థిక సంవత్సరంలో కీలకమైన పథకాలకూ, సంక్షేమ కార్యక్రమాలకు వుద్దేశించిన కేటాయింపులలో రూ. 32,000 కోట్ల మేరకు ప్రభుత్వం కోత విధించింది. ఇదే సమయంలో కార్పొరేట్ పన్నుల్లో రాయితీలు యివ్వటంతో 2012–13 బడ్జెట్‌లో కలవాల్సిన రూ. 5.28 లక్షల కోట్లు గంగలో కలిశాయి.

ప్రభుత్వం యిచ్చిన దన్నుతో ప్రకృతి వనరులను కార్పొరేట్ రంగం బహిరంగంగా దోచుకుంటున్న కారణంగా, పశుగ్రాసం, కట్టెలు, నీరు, అటవీ ఉత్పత్తులు తదితరాలు సేకరించే మహిళలపై దారుణమైన ప్రభావం పడింది. సహజ వనరులను కబళించటం, పెద్ద మొత్తంలో భూ ఆక్రమణ, భారీ నీటి పథకాల కారణంగా పెద్దయెత్తున ప్రజలు నివాసాలను కోల్పోవటం జరుగుతున్నది, దీనివల్ల వనరుల లభ్యత తగ్గటంతోపాటు, సేకరణ వ్యయం పెరుగుతున్నది. ఇదే సమయంలో సామాజిక రంగ వ్యయంలో కోత

కారణంగా స్త్రీలకు ఇంటిపని, ఆర్థిక సంరక్షణ బాధ్యత పెరుగుతున్నది. గుర్తింపుకు నోచని యీ మహిళా శ్రమకు అంతం అనేదే లేకుండా పోతున్నది. యుపిఏ ప్రభుత్వ వైఫల్యాలు ఎల్లెడెలా అసంతృప్తిని పెంచాయి. కార్పొరేట్ శక్తుల అండదండలనూ, మహిళల హక్కులకు వ్యతిరేకమైన రాజకీయాలను నడిపే బిజెపీ ప్రాతినిధ్యాన్నీ కలిగి వున్న మితవాద మతతత్వ శక్తులు యీ దుస్థితిని వుపయోగించు కోవాలని చూస్తున్నాయి. మతతత్వ భావాలకు ప్రాతినిధ్యం వహించే ఆరెస్సెస్ తదితర హిందూత్వ శక్తులు స్త్రీలను పురుషుల నీడగా చెప్తూ, సంప్రదాయం పేరుతో తిరోగామి ఆచారాలను, సిద్ధాంతాలను నిరంతరం వ్యాప్తి చేస్తున్నాయి. భారత రాజ్యాంగంలో పొందుపరచిన మహిళల స్వతంత్ర పౌరసత్వ హక్కులకు యీ శక్తులు పెనుముప్పుగా తయారయ్యాయి.

## 33 శాతం రిజర్వేషన్‌కు ద్రోహం

పార్లమెంటులో ఆధిక్యత వున్నప్పటికీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను కల్పించే బిల్లును ఆమోదింప చేయటంలో యుపిఏ-2 ప్రభుత్వం పూర్తిగా వైఫల్యాన్ని పొందింది, ఆ ప్రభుత్వం చేసిన అతి పెద్ద విద్రోహాలలో యిది ఒకటి. బిల్లును నిలిపి వుంచటంలో బిజెపీ పూర్తి సహకారాన్ని అందించింది. వామపక్షాలు మినహా ప్రతిపక్షంలో ఒక్క పార్టీ కూడా యీ బిల్లు లోకసభ ఆమోదాన్ని పొందేటందుకు ఒత్తిడి తేలేక పోయాయి. ఎన్నికల విధానంలో మహిళల స్థానాన్ని త్రోసిపుచ్చటమంటే పార్లమెంటరీ సంస్థలను కూలదోయటమే అవుతుంది.

## మహిళలపై మున్నెన్నడూ ఎరుగని హింసాకాండ

అంతకంతకూ స్త్రీలు దుర్మార్గమైన హింసకు గురవుతున్నారు. ప్రతి రోజూ 68 మానభంగాలు (ప్రతి గంటకు మూడు అత్యాచారాలు), 23 వరకట్న మరణాలు (దాదాపుగా గంటకు ఒకటి) సంభవిస్తున్నాయి. ఆందోళన కలిగించే అసహ్యకర ధోరణికి పై గణాంకాలు సూచికలు. ఆడవాళ్ళు సరకులుగా మారి పోవటానికీ, పితృస్వామిక, సనాతన ధోరణితో కులతత్వ, మతతత్వ శక్తులు సాగించే దాడులు పెరగటానికీ నయా ఉదారవాద ఆర్థిక విధానాలు దారితీస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితి మరీ

దారుణంగా తయారైంది. రాజకీయ ప్రత్యర్థులకు, అసమ్మతి గళాలకు వ్యతిరేకంగా తన ప్రభుత్వ మద్దతుతో పాలక పార్టీ సాగించే హింసా రాజకీయాల దుష్ఫలితాలు పౌరులందరికీ, ప్రత్యేకించి స్త్రీలపాలిట శాపంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలను నేరపూరితం చేయటంతోపాటు లైంగిక దాడులకు గురైన స్త్రీలు ఫిర్యాదు చేసినపుడు ఆ బాధితులనే నిందించటం ద్వారా స్వయంగా ముఖ్యమంత్రే నేరస్తులకు వత్తాసు పలుకుతున్న ప్రత్యక్ష ఫలితంగానే యీ దుస్థితి నెలకొన్నది. లైంగిక దాడులకు గురైన బాధితులపట్ల ఒక ప్రభుత్వాధినేత పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి వలె వ్యవహరించడం భారతదేశంలోనే చాలా అరుదైన విషయం. వరుసగా రెండవసారి సైతం మహిళలపై నేరాల విషయంలో పశ్చిమ బెంగాల్ ముందున్నది. 2012లో మొత్తం 30,942 ఘటనలు సంభవించగా అందులో 2,046 ఘటనలు అత్యాచారాలకు, అపహరణలకు సంబంధించినవే.

భారతదేశం మొత్తంమీద చూసినట్లయితే యిటీవలి గణాంక వివరాలు దిగ్భ్రాంతి కొలిపేవిగా వున్నాయి. స్రీలపై అంతకంతకూ నేరాలు పెరుగుతున్నట్లు జాతీయ నేర నమోదు విభాగం (ఎన్‌సిఆర్‌బి) పేర్కొన్నది. 2012లో మొత్తం 2,44,290 నేర ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇది 2011కన్నా 6.8 శాతం ఎక్కువ. 2010తో పోలిస్తే అత్యాచారాల పెరుగుదల 12.4 శాతం (24,923) వుండగా, అపహరణ వుదంతాలు భీతిగొలిపే విధంగా 28.4 శాతం (38,262) పెరిగాయి. నమోదైన ఘటనలలో 18-30 ఏళ్ళ మధ్య వయసున్న వారు 50.2 శాతం వుండగా, 14 ఏళ్ళ లోపువారు 12.5 శాతం, 14-18 ఏళ్ళ మధ్య వయసున్నవారు 23.9 శాతం వున్నారు.

దేశం మొత్తంమీద నగరాలలో 5.30 కోట్లకు పైగా ఘటనలు నమోదుకాగా, ఢిల్లీలో 19.3 శాతం అత్యాచారాలు, 23.1 శాతం అపహరణలు, 14.6 వరకట్న మరణాలు, 10.9 శాతం వేధింపుల కేసులు నమోదయ్యాయి.

కొంతమంది ఆరెస్సెస్ నాయకులు చెప్తున్నట్లుగా గ్రామీణ భారతం యిందుకు మినహాయింపేమీ కాదు. నిజానికి దళిత, ఎస్టీ తదితర బలహీన తరగతులకు చెందిన స్త్రీలు వేధింపులకు గురవుతున్నారు. హర్యానాలో 2012 సెప్టెంబరు 9 నుండి అక్టోబరు 11 లోపు లైంగిక దాడులకు సంబంధించి 19 ఘటనలు సంభవించాయి. వీటిలో 70

శాతం సామూహిక అత్యాచార ఘటనలు. బాధితులలో 30 శాతం దళిత, వెనుకబడిన తరగతులకు చెందిన వారు. వయసురీత్యా చూస్తే 20 ఏళ్ళలోపు వారు 40 శాతం వున్నారు. హింసకు సంబంధించి పాత, కొత్త రూపాలు మిళితం కావటం చూస్తుంటే ఒళ్ళు జలదరించక మానదు. ఈ దేశంలోని స్త్రీలు ఎంత అరక్షిత స్థితిలో నివసిస్తున్నదీ యీ దాడులు కళ్ళకు కడుతున్నాయి. పిల్లలపై లైంగిక దాడులు, యాసిడ్ దాడులు, కుటుంబ గౌరవం పేరుతో హత్యలు, సామూహిక మానభంగాలు పెరిగి పోతున్నాయి.

భీతిగొలిపే మరో ధోరణి ఏమంటే యువతుల ఆకాంక్షలను చిదిమి వేయడం. ఎన్‌సిఆర్‌బి నమోదు చేసిన వివరాల ప్రకారం 2001-11 మధ్య భారతదేశంలో లైంగిక దాడులకు 43,338 మంది పిల్లలు గురయ్యారు. ఈ కాలంలో పిల్లలపై లైంగిక దాడులు 336 శాతం పెరిగాయి. అత్యధిక ఘటనలు మధ్యప్రదేశ్‌లో సంభవించాయి. ఆ తరువాత వరుసగా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లు వస్తాయి. బాధ కలిగించే మరో విషయం ఏమంటే, ఆసియన్ మానవ హక్కుల కేంద్రం 39 ఘటనలను అధ్యయనం చేయగా వాటిలో 11 ఘటనలు ప్రభుత్వ పరిశీలక గృహాలలోనూ, 27 ఘటనలు ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు నడిపే శిశుశరణాలయాలలోనూ సంభవించినట్లు వెల్లడైంది. సంరక్షకులు, భద్రతాధికారులు, వంటవారు, అలానే యీ సంస్థలలో దీర్ఘకాలంగా వుంటున్న వారు యీ అకృత్యాలకు పాల్పడ్డారు. వీరితోపాటు నిర్వాహకులు, డాక్టర్లు, యజమానులు, వారి బంధువులు-మిత్రులు కూడా వున్నారు. పిల్లలు చదువుకుని తమ పరిస్థితులను మెరుగు పరచుకునేలా ప్రభుత్వం తగు రక్షణను, భద్రతను అందివ్వటం లేదు.

లైంగిక హింసను ఎదుర్కొనేందుకు వర్మ కమిటీ సూచించిన సమగ్ర సూచనలకు మార్క్సిస్టు పార్టీ మద్దతు యిస్తున్నది. అలానే, మున్నెన్నడూ ఎరుగని రీతిలో ప్రజలలో ఆగ్రహాన్ని ప్రజ్వరిల్ల చేసిన 2012 డిసెంబరు 16 నాటి సామూహిక మానభంగం, హత్య దుర్ఘటన అనంతరం నేరస్మృతికి ఆమోదించిన సవరణల అమలుకు పార్టీ పోరాడుతుంది. నేర విచారణ విచారణ విధానంలో వున్న లోపాలను సవరించ వలసిందిగా పార్టీ నిరంతరం డిమాండు చేస్తున్నది. మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి చూస్తే అత్యాచార ఘటనలలో 24 శాతం మందికి, వరకట్న మరణం కేసుల్లో 32 శాతం మందికి, వివిధ రకాలైన నేరాలలో కేవలం 21.3 శాతం మందికి మాత్రమే శిక్షలు పడ్డాయి.

స్త్రీలు సురక్షితంగా వుండాలంటే వారు ఇళ్ళకే పరిమితం కావాలని సనాతన ఛాందస శక్తులు సలహా యిస్తున్నాయి. అసలు వాస్తవం యేమిటి? అత్యధిక నేరాలు ఇళ్ళల్లోనే సంభవిస్తున్నాయి. 8,233 'వరకట్న మరణాలను' (సెక్షన్ 302, 304 ఐపిసి), అలానే, 'భర్త, బంధువుల క్రూరత్వానికి' సంబంధించిన 1,06,527 ఫిర్యాదులను (సెక్షన్ 498-ఏ, ఐపిసి), వరకట్న నిషేధ చట్టం క్రింద 9,038 కేసులను ఎన్‌సిఆర్‌బి నమోదు చేసింది. ఈ వివరాల దృష్ట్యా గృహహింస ఏ స్థాయిలో వున్నదీ అర్థం చేసుకోవచ్చు.

చట్టం ప్రకారం ఫిర్యాదులు చేయటానికి అంతకంతకూ మహిళలు ముందుకు వస్తున్నప్పటికీ, కేంద్ర బడ్జెట్ కేటాయింపులు మాత్రం సున్నా. వనరులు లేని రాష్ట్రాలు బిల్లు అమలుకు అవసరమైన స్వతంత్ర రక్షణ అధికారుల నియామకాన్ని, బడ్జెట్ కేటాయింపులను చేయటం లేదు. ఇళ్ళల్లోనూ, బహిరంగ స్థలాల్లోనూ స్త్రీ పురుషుల సమానత్వం కోసం సామాజిక సంస్కరణల మద్దతుతో చట్టాల అమలు ఎంతైనా అవసరం.

చరిత్రాత్మకమైన విశాఖ కేసులో సుప్రీం కోర్టు యిచ్చిన తీర్పు అమలు కోసం ప్రధానంగా మహిళా సంఘాలు 16 ఏళ్ళపాటు చేసిన పోరాటం ఫలితంగా పని స్థలాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం వునికిలోకి వచ్చింది. తీవ్రమైన కొన్ని లొసుగులను తొలగించేటందుకై మార్క్సిస్టు పార్టీ కీలకమైన పలు సవరణలను ప్రతిపాదించింది. అయితే వీటిని ప్రభుత్వంతోపాటు ప్రధాన ప్రతిపక్షమైన బిజెపీ కూడా వ్యతిరేకించింది. కాగా, చట్టాన్ని బలోపేతం చేయటానికే మార్క్సిస్టు పార్టీ కట్టుబడి వున్నది.

**గర్భస్థ స్త్రీ శిశువుల హత్య :** 2001-11 మధ్య 27 రాష్ట్రాలలోనూ, కేంద్రపాలిత ప్రాంతాలలోనూ బాలబాలికల్లో లింగ నిష్పత్తి (సిఎస్‌ఆర్) 927 నుంచి 914కు దారుణంగా పడిపోయినట్లు 2011 జనాభా లెక్కలు తెలియ చేస్తున్నాయి. 1-6 ఏళ్ళ మధ్య వయసున్న బాలబాలికల్లో లింగ నిష్పత్తి 919గా వున్నట్లు యిటీవల విడుదల చేసిన 2011 జనాభా లెక్కల వివరాలు తెలియ చేస్తున్నాయి. 7-15 మధ్య యీ నిష్పత్తి మరింతగా తగ్గి 911కు చేరింది. బాలికలపట్ల ఎంతగా నిర్లక్ష్యం చూపుతున్నదీ దీనినిబట్టి తెలుస్తున్నది. పిసిపిఎన్‌డిటి చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని యీ పరిస్థితి తెలియ చేస్తున్నది. బాలికలపట్ల విద్వేషాలు పెరగటానికి కాంగ్రెసు, బిజెపీ ప్రభుత్వాల తప్పుడు విధానాలు కూడా కారణం. మోడి నేతృత్వంలోని గుజరాత్‌లో బాలబాలికల లింగ నిష్పత్తి దారుణంగా తయారైంది.

## మహిళలకు వ్యతిరేకంగా మతహింస

ముజఫర్‌నగర్‌లో చోటుచేసుకున్న అతి లజ్జాకరమైన మత అల్లర్లలో పలువురు మైనారిటీ మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. దాదాపు 40,000 కుటుంబాలు నిరాశ్రయమయ్యాయి. హిందూత్వ మూకలు పెంచి పోషించిన విచ్ఛిన్నకర, మతోన్మాద రాజకీయాల దుర్మార్గపు ఫలితమిది. రానున్న ఎన్నికలను దృష్టిలో వుంచుకుని యీ ప్రాంతంలో ఆరెస్సెస్ అనుబంధ సంస్థలు విచ్ఛిన్నకర, విద్వేష బీజాలు నాటాయన్న సంగతి అందరికీ తెలిసిందే. 'బహు, బేటి బచావో' అన్న నినాదంతో మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన సంస్థ బాధ్యులు లైంగిక వేధింపులకు మైనారిటీలను నిందించటం మరీ దుర్మార్గమైన విషయం. నిజానికి రెండు సామాజిక వర్గాలలోని నేరస్థులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, రెండు సామాజిక తరగతులలోని మహిళలు బాధితులుగా మిగిలారని పోలీసు రికార్డులు తెలుపుతున్నాయి. ఏదియేమైనప్పటికీ, కుల, మత సామరస్యానికి ప్రతీకగా వున్న ప్రాంతంలో భావోద్రేకాలను రెచ్చగొట్టి ఆటవిక చర్యలకు దిగటం జరిగింది. ఇతర ప్రాంతాలలో సైతం ఆరెస్సెస్ అనుబంధ సంస్థలు మత విభజనలను రెచ్చగొట్టటంలో చురుకుగా పని చేశాయి. ఈ దుర్ఘటనలు మొత్తం స్త్రీ లోకంపై దురదృష్టకర ప్రభావాన్ని చూపాయి. ఎందుకంటే వారికి రక్షణ తక్కువగా వుంటుంది. 'అవతలి సామాజిక తరగతికి ఒక గుణపాఠాన్ని నేర్పాలన్నదే" మతోన్మాదుల వుద్దేశం.

మతతత్వ శక్తులకూ, వారు బోధించే విద్వేషపూరిత, హింసాయుత భావజాలానికి, కార్యక్రమాలకు వ్యతిరేకంగా పోరాటానికి కట్టుబడి వున్న శక్తులను బలోపేతం చేయటానికీ, సంరక్షించడానికీ మహిళల భద్రతను కల్పించడం ఎంతైనా అవసరం.

## ఛాందసవాద ప్రతికూల భావజాలం-నైతిక కాపలాదారులు

తమ వ్యక్తిగత జీవితాలకు సంబంధించి మహిళలు ప్రజాస్వామ్య ఆకాంక్షలను వ్యక్తం చేసినపుడు కుల, తిరోగామి శక్తుల ప్రతికూల భావాలు కూడా మహిళలపై నేరాలకు కారణం అవుతున్నాయి. కులాంతర వివాహం చేసుకున్న యువ దంపతులు స్వయం ప్రకటిత ఖాఫ్ పంచాయతీల ఆగ్రహాన్ని ఎదుర్కొనవలసి వస్తున్నది. ఈ పంచాయతీలు

జారీ చేసే ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమైనవి, చట్ట వ్యతిరేకమైనవి. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా గౌరవం పేరుతో సాగే నేరాలు యిబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. ఈ తరహా నేరాలను ప్రోత్సహిస్తున్న ఖాప్ పంచాయతీలపైనా, రాజ్యాంగేతర సంస్థలపైనా చర్యలు తీసుకోవటంలో ప్రభుత్వం విఫలమవుతున్నది. రాజకీయ మద్దతు కోల్పోవలసి వస్తుందన్న భయంతోనే ప్రభుత్వం యిలా ప్రవర్తిస్తున్నది. జీవిత భాగస్వాములను ఎంపిక చేసుకునే తమ హక్కును వినియోగించుకుంటున్న యువ దంపతులపై గౌరవం పేరుతో నేరాలకు, శిక్షల విధింపులకు పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్న వైఖరికి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మాత్రమే కట్టుబడి వున్నది.

తమకు వ్యతిరేకంగా జరిగే హింసకు మహిళలే స్వయంగా కారణ మవుతున్నారంటూ ఆరోపణ చేసే తిరోగామి శక్తులు ఛాందసత్వ, పురుషాధిపత్య భావజాలంతో దాడులు చేస్తున్నాయి. అన్ని మత సమాజాలలోనూ ఛాందసవాద శక్తులు నైతిక కాపలాదారులుగా అవతారం ఎత్తుతున్నాయి, వస్త్రధారణపై ఆంక్షలు విధించటంతో పాటు యువతులు మొబైల్ ఫోన్‌లను వినియోగించ రాదని, మగపిల్లలు చదివే విద్యాలయాల్లో చేరరాదంటూ నిషేధం విధిస్తున్నాయి. రక్షణ పేరుతో రాజ్యాంగేతర సంస్థలు కొన్ని స్త్రీలపై అదుపును పునరుద్ధరించటానికి ప్రయత్నిస్తున్నాయి. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడులు జరుగుతున్నాయి.

తిరోగామి, విచ్ఛిన్నకర, మతతత్వ శక్తులకూ వారి మహిళా వ్యతిరేక భావజాలానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటానికే మార్క్సిస్టు పార్టీ కట్టుబడి వున్నది.

## పెరుగుతున్న సామాజిక అన్యాయం

గత మూడు సంవత్సరాలుగా దళితులపైనా ప్రత్యేకించి దళిత స్త్రీలపైనా పెరిగి పోతున్న హింసాకాండ భీతిగొల్పేదిగా తయారైంది. ఎన్‌సిఆర్‌బి సేకరించిన వివరాల ప్రకారం 2010లో 1,349 మంది దళిత మహిళలు అత్యాచారాలకు గురికాగా 2012లో 1,576 మంది అత్యాచారాలకు గురయ్యారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో

యీ నేరాలు 50 నుంచి 60 శాతం వరకు పెరిగాయి. ఈ కాలంలోనే హర్యానాలో దాదాపుగా రెట్టింపయ్యాయి, అంటే, 37 నుంచి 67కు పెరిగాయి. రాజ్యాంగం ఆదేశిస్తున్నప్పటికీ కుల వివక్షత, అస్పృశ్యతలు సామాజిక హింసారూపంగా కొనసాగుతూనే వున్నాయి. దేవాలయ ప్రవేశం, ఉమ్మడి శ్మశానవాటిక తదితరాలకు సంబంధించి అస్పృశ్యతా వ్యతిరేక వేదికలపై నుంచి సాగించే పోరాటాలలో వామపక్ష పార్టీలు యీ అంశాలను ముందుకు తెస్తున్నాయి.

***కుల వివక్షతకూ, దళిత మహిళలపై సాగే హింసకూ వ్యతిరేకంగా పోరాడటానికే మార్క్సిస్టు పార్టీ కట్టుబడి వున్నది.***

## మహిళలు-శ్రమ

స్త్రీలు చేసే శ్రమ అంతకంతకూ గుర్తింపును, విలువను కోల్పోతున్నది. వారు గృహ పరిచారికలుగా, లేదా, కుటీర పరిశ్రమకు చెందిన శ్రామికులుగా, లేదా, కంట్రాక్టు కార్మికులుగా అసంఘటిత రంగంలో కూరుకు పోతున్నారు, వారికి అతి తక్కువ వేతనాలు మాత్రమే ముడుతున్నాయి, చట్టబద్ధమైన రక్షణ వుండటం లేదు, పైగా దోపిడీకి తేలికగా గురవుతున్నారు. చిల్లర వ్యాపారంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవేశించటంతో స్వయం ఉపాధి రంగంలో వున్న లక్షలాది స్త్రీల జీవనానికి ప్రమాదం ఎదురైంది. పలువురు స్త్రీలు వేరే మార్గంలేక అరక్షితమైన, దోపిడీకి ఆకరమైన వలసబాటను పడుతున్నారు, కొంతమంది వ్యభిచార కూపాల్లో చిక్కుపడుతున్నారు.

కుటుంబ పోషణ కోసం ఎలాంటి పనినైనా చేపట్టవలసి వస్తున్నది, ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2004–05 నుంచి 2009–10 మధ్య శ్రామికశక్తిలో మహిళల సంఖ్య దాదాపు రెండు కోట్ల మేరకు తగ్గిపోయింది. విశేషమేమంటే యిదే కాలంలో ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరిగింది.

వ్యవసాయ సంక్షోభం తీవ్రతరం కావటంతో గ్రామీణ ప్రాంతాలపై దాని ప్రభావం తీవ్రంగా పడుతున్నది. నానాటికీ పెరిగిపోతున్న రైతుల ఆత్మహత్యల్లోనూ, వలసల్లోనూ

యీ వాస్తవం కొట్టవచ్చినట్లు కనపడుతున్నది. ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం 2,70,940 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంటే 2001 నుండి 2011 మధ్య సగటున ఏడాదికి 16,743 మంది లేదా రోజుకు 46 మంది బలవన్మరణం పాలయ్యారు. ప్రధాన పోషకుని కోల్పోయిన కుటుంబాల భారం అకస్మాత్తుగా వితంతువులపై పడుతుండటం విషాదకర వాస్తవం, నయా ఉదారవాద విధానాల పుణ్యమే యీ దుస్థితి. ఇది చాలదన్నట్లు స్త్రీలను రైతులుగా గుర్తించటానికీ లేదా నమోదు చేయటానికీ ప్రభుత్వం నిరాకరిస్తున్నది. రుణమాఫీ పథకాల నుండి వారి పేర్లను తొలగిస్తున్నారు. మహిళల కోసం నిర్దిష్టమైన చర్యలను సూచించిన స్వామినాథన్ సిఫార్సులను సైతం ప్రభుత్వం అటకెక్కించింది.

గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగాన్నీ, దుర్దశనూ ఎదుర్కొనేందుకు ప్రధాన సాధనంగా వుపయోగపడే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఆమోదించేలా 2007-08లో ప్రభుత్వంపై మార్క్సిస్టు పార్టీ ఒత్తిడి తెచ్చింది. నిరుపేద మహిళల నుంచి సానుకూల స్పందన రావటంతో యీ పథకంలో పాల్గొన్న వారిలో స్త్రీలు 2006-07లో 41 శాతం కాగా 2012-13లో52 శాతానికి చేరారు. అయితే అత్యధిక వుత్పాదక ప్రమాణాల పేరుతో మహిళలకు కనీస వేతనాలను నిరాకరిస్తున్నారు. ఉపాధి పథకం క్రింద ఏడాదిలో 100 పనిదినాలకు హామీ యిచ్చినప్పటికీ, వాటిని 45 పనిదినాలకు కుదించటం జరిగింది. ఇప్పుడు నిధులలో సైతం కోత విధించారు. అంతేకాక చట్టం ఆదేశిస్తున్న పనులను కూడా లబ్దిదారులకు అందనివ్వటం లేదు.

గ్రామీణ ఉపాధి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని అదేవిధంగా పట్టణ ఉపాధి పథకాన్ని కూడా ప్రవేశపెట్టాలని మార్క్సిస్టు పార్టీ పోరాడుతున్నది.

ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న, అంటే, అంగన్‌వాడి, సేవికలు, ఆశా, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే శ్రామికులు కనీస వేతనాలకు, హక్కులకు నోచుకోవడం లేదు. అయితే శ్రామికులుగా వారి గుర్తింపు కోసం, హక్కుల కోసం మార్క్సిస్టు పార్టీ పోరాడుతున్నది.

## ధరల పెరుగుదల-ఆహార అభద్రత

## నిరంతరం పెరుగుతున్న ధరలు

ధరల పెరుగుదల, ఆహార అభద్రత అనేవి పితృస్వామ్య సమాజంలో నివసిస్తున్న స్త్రీలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. కుటుంబం కోసం వారు తమ అవసరాలను వదులు కుంటున్నారు. ధరల పెరుగుదల ప్రజలందరినీ బాధిస్తున్నప్పటికీ, ప్రత్యేకించి మహిళల జీవన ప్రమాణాలు దిగజారటానికి ప్రధాన కారణంగా మారాయి. విధానపరమైన మార్పులు లేకుండా యీ పరిస్థితిని చక్కదిద్దటం అసాధ్యం. వామపక్షాలు మాత్రమే యీ రకమైన సూచనలను చేయగలుగుతున్నాయి. పెట్రోలు, డీసెల్ ధరల నియంత్రణను పునరుద్ధరించాలని, నిత్యావసర సరకులలో ముందస్తు వ్యాపారాన్ని నిషేధించాలని, అక్రమ నిల్వదారులపై కఠిన చర్యలు చేపట్టాలని, లోపభూయిష్టమైన ఆహార భద్రతా బిల్లుకు మారుగా ప్రజాపంపిణీ వ్యవస్థను సార్వత్రికం చేయాలని మార్క్సిస్టు పార్టీ పిలుపు యిస్తున్నది.

సార్వత్రిక ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికీ 35 కిలోల ధాన్యాన్ని కిలో ఒక్కింటికి రూ 2ల ధర మించకుండా యివ్వాలన్న దానికే మార్క్సిస్టు పార్టీ కట్టుబడి వున్నది.

ప్రజల ప్రాథమిక సదుపాయాల కల్పన నుండి యుపిఏ, బిజెపీ ప్రభుత్వాలు రెండూ తప్పించు కోవటంతో సామాజిక రంగ అర్హతలు సైతం దాడులకు గురవుతున్నాయి. ఈ రెండు పార్టీలు చేపట్టిన ప్రైవేటీకరణ విధానాలు విద్యా, వైద్య రంగాలు కాసులు వర్షం కురిపించే విభాగాలుగా మారిపోయాయి. రాజకీయ లక్ష్యం లేకపోవటంతో విద్యారంగం పూర్తిగానే నీరుగారి పోయింది. ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టిన ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆరోగ్య రంగం త్వరితగతిని కార్పొరేట్ కబంధ హస్తాలలోకి వెళ్ళిపోయింది. చివరకు రోజువారీ అవసరాలను సైతం ప్రైవేటీకరించారు. భారతదేశంలో 58 శాతం కుటుంబాలకు కొళాయి నీరు అందుబాటులో లేదు. దాదాపు సగానికి పైగా కుటుంబాలకు మరుగుదొడ్లు లేవు. ఇటువంటి అవసరాలపట్ల కాంగ్రెసు, బిజెపీ పార్టీలు అనుసరిస్తున్న

దివాళాకోరు విధానాలవల్ల స్త్రీలు అనేక యిబ్బందులను ఎదుర్కొంటున్నారు. నయా ఉదారవాద శకంలో సార్వత్రిక ఉచిత సేవలకు ప్రభుత్వ వ్యయం తగ్గుతున్నది.

నీరు, పరిశుభ్రత, గృహ వసతి, విద్య, ఆరోగ్యంవంటి ప్రాథమిక సదుపాయాలు అందరికీ అందుబాటులోకి రానంత వరకు గౌరవప్రదమైన జీవితానికి ఎలాంటి హామీ లభించదని మార్క్సిస్టు పార్టీ గట్టిగా నమ్ముతున్నది.

మహిళలకు సంబంధించిన వ్యవహారాలు, వారి డిమాండ్లు ప్రజాతంత్ర వుద్యమంతో విడదీయరాని భాగమనే మార్క్సిస్టు పార్టీ భావిస్తున్నది. హింసారహిత వాతావరణానికి, సామాజిక న్యాయానికీ, గౌరవప్రదమైన జీవితానికీ మహిళలకు హక్కు వున్నదనే అంశం మార్క్సిస్టు పార్టీ రాజకీయ అజెండాలలో కేంద్రకంగా వున్నది.

మహిళల మానవ హక్కుల కోసం కృషి చేస్తానని, శ్రామికులుగా, పౌరులుగా వున్న మహిళలకు సంకెళ్ళువేసి అణచివేసే రకరకాలైన అన్యాయాలను ఎదుర్కొనే ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తీసుకు రావటానికి శ్రమిస్తానని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రతిజ్ఞ చేస్తున్నది.


**వెల :₹ 2/-**

**ప్రచురణ కర్త :**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తరపున**
**జె. జయరాం, హౌస్ నెం. 1-1-60/2, యం.బి.భవన్,**
**ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ముషీరాబాదు, హైదరాబాద్ -20**